క్లుప్తంగా

రైతుల సమక్షంలో సర్వే రాళ్లు


కపిలేశ్వరపురంలో సర్వే రాళ్ల ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న తహసీల్దార్

కపిలేశ్వరపురం: భూముల రీ సర్వేలో భాగంగా కపిలేశ్వరపురంలో గురువారం సర్వే రాళ్లు ఏర్పాటు కార్యక్రమాన్ని ప్రారంభించారు. తహసీల్దార్ కొమరం సూర్యారావు కార్యక్రమాన్ని పరిశీలించి రెవెన్యూ సిబ్బందికి పలు సూచనలు చేశారు. శాశ్వత భూహక్కు పారదర్శకంగా అందించే కార్యక్రమంలో భాగంగా రీసర్వే పథకం కొనసాగుతుందన్నారు.

ఎస్సైగా జానీబాషా బాధ్యతల స్వీకారం


నూతన ఎస్సై బాషాకు స్వాగతం పలుకుతున్న స్టేషన్ సిబ్బంది

కె.గంగవరం: స్థానిక ఎస్సైగా జానీబాషా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా పని చేసిన చిరంజీవి సీతానగరం బదిలీ అవడంతో ఆయన స్థానంలో నగరం ఎస్సై జానీబాషా నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనకు కె.గంగవరం పోలీస్ స్టేషన్ సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎస్సై బాషా మాట్లాడుతూ, మండలంలోని అన్ని గ్రామాల్లోనూ శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా తగిన చర్యలు తీసుకుంటానని చెప్పారు. ఫ్రెండ్లీ పోలీసు విధానం అవలంబిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్సై రాంబాబు, సిబ్బంది శ్రీనివాస్, కామేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి


ప్రమాదాలకు నిలయంగా ఉన్న మలుపు

కె.గంగవరం: మండలంలోని తామరపల్లి ప్రారంభంలో ఉన్న మలుపు ప్రమాదాలకు నిలయంగా మారింది. ఇక్కడ రెండు ప్రమాదకర మలుపులు ఉన్నాయి. దీంతో పాటు పక్కనే చెరువు కూడా ఉంది. ప్రమాదకర మలుపులున్నప్పటికీ ఇసుక లారీలు వేగం తగ్గించకుండా దూసుకువస్తున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దీంతో పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారని అంటున్నారు. ఈ రోడ్డు నిర్మించినప్పటి నుంచీ స్పీడు బ్రేకర్లు వేయాలని అధికారులను వేడుకుంటున్నామని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్పీడు బ్రేకర్లు వేయాలని కోరుతున్నారు.

గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి


పడమర ఖండ్రికలో సీసీ రహదారి నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర, పడమర ఖండ్రిక గ్రామాల్లో సీసీ రహదారుల నిర్మాణాలు పూర్తయ్యాయి. గడప గడపకూ మన ప్రభుత్వం పథకంలో భాగంగా సచివాలయానికి రూ.20 లక్షలు చొప్పున ఇరు గ్రామాలకు నిధులు మంజూరయ్యాయి. వాటితో పడమర ఖండ్రికలో నాలుగు, అంగరలో ఒక సీసీ రహదారుల నిర్మాణాలు పూర్తయ్యాయి. వాటి నాణ్యతను గురువారం క్వాలిటీ కంట్రోల్, విజిలెన్స్ డీఈఈ సురేష్‌కుమార్, అధికారుల బృందం సభ్యులు తనిఖీ చేశారు. సకాలంలో నిర్మాణాలను పూర్తి చేసినట్టు పీఆర్ జేఈ డీవీ రాఘవులు తెలిపారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ


పడి తొక్కుతున్న అయ్యప్పస్వాములు

రాయవరం: రాయవరంలో గురువారం రాత్రి అయ్యప్ప పడిపూజ వైభవంగా నిర్వహించారు. స్థానికంగా ఏర్పాటు చేసిన అయ్యప్పస్వామి ఆశ్రమం వద్ద యాళ్ల పవన్ వీరఅప్పాజీ, పోలరాజు స్వాములు పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. పీఠం గురుస్వామి పులగం శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు అనంతరం పడిపూజ చేశారు. ఈ పూజల్లో జానకి రామారెడ్డి గురుస్వామి, కుమార్ గురుస్వామి, రాయవరం, కొంకుదురు తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

వరిపై వాతావరణం


కాజులూరు మండలం మొగలిపాలెంలో ఎండాకు తెగులు సోకిన వరి పొలం


ఎండాకు తెగులుతో చనిపోతున్న వరి దుబ్బు

- పంటను ఆశిస్తున్న ఎండాకు తెగులు
- రైతుల ఆందోళన
- సస్యరక్షణ చేపట్టాలంటున్న వ్యవసాయాధికారి

కాజులూరు: తీవ్ర స్థాయిలో కాస్తున్న ఎండలు.. అంతలోనే వానలు.. ఇటువంటి విచిత్ర వాతావరణం పంటలపై ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా వరి పంటపై ఎండాకు తెగులు ఆశిస్తోందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుత ఖరీఫ్‌లో రామచంద్రపురం నియోజకవర్గంలో 54,700 ఎకరాల్లో రైతులు వరి సాగు చేపట్టారు. కాజులూరు మండలంలో 19,700 ఎకరాలు, రామచంద్రపురంలో 19 వేలు, కె.గంగవరం మండలంలోని గ్రామాల్లో 16 వేల ఎకరాల్లో వరి సాగు జరుగుతోంది. ప్రతికూల పరిస్థితులను అధిగమిస్తూ రైతులు ముందుకు సాగుతూండగా.. ఊహించని వాతావరణ మార్పులతో పంటలపై తెగుళ్లు దాడి చేస్తున్నాయి. పలు గ్రామాల్లో ప్రస్తుతం అక్కడక్కడ వరి నాట్లు ఇంకా కొనసాగుతున్నాయి. అధిక శాతం పొలాల్లో పంట దుబ్బు కట్టే దశలో ఉంది. ఇందులో సుమారు 20 శాతం పొలాల్లో ఎండాకు తెగులు లక్షణాలు కనిపిస్తున్నాయని రైతులు అంటున్నారు.

ముందుగా వరి ఆకులపై చిన్నచిన్న నీటి డాగు మచ్చలు ఏర్పడుతున్నాయని, ఆపై ఆకుల అంచుల వెంబడి, మధ్య భాగంలో ఎండిపోతున్నాయని చెబుతున్నారు. అయితే, రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదని, అవసరమైన సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

చర్యలు తీసుకోండిలా..



వాతావరణంలో ఉష్ణోగ్రతల వ్యత్యాసాల కారణంగా వరిపై ఎండాకు తెగులు సోకే అవకాశం ఉంటుంది. నాట్లు వేసిన నెల రోజుల వ్యవధిలో ఇది ఆశిస్తుంది. ఈ లక్షణాలు చూసి చాలా మంది రైతులు కాండం కుళ్లు లేదా దుబ్బు కుళ్లు అని భావించి శిలీంధ్ర నాశినులు పిచికారీ చేస్తున్నారు. దీని వలన తెగులు నివారణ జరగకపోవడమే కాకుండా అనవసరపు ఖర్చు పెరుగుతుంది. ఈ తెగులు నిర్ధారణకు పైరులో ఎండిన ఆకులు కత్తిరించి మంచినీటితో ఉన్న గ్లాసులో వెయ్యాలి. అరగంట తర్వాత చూస్తే తెగులు ఆశించిన భాగాల నుంచి బాక్టీరియా నీటిలోకి ప్రవేశించి గాఢత పెరిగి నీరు పసుపు రంగులోకి మారుతుంది. ఈ లక్షణాలుంటే ఎండాకు తెగులు సోకినట్టు గుర్తించాలి. వ్యాధి నిర్ధారణ కాగానే పొలంలో బాక్టీరియాకు ఆవాసం కల్పించే కలుపు, ఇతర పిచ్చి మొక్కలను తొలగించాలి. వీలైనంత వరకూ పొలంలో రెండు మూడు సార్లు నీరు తీసి కొత్త నీరు పెట్టుకోవాలి. తెగులును అరికట్టేందుకు లీటరు నీటికి 0.5 నుంచి ఒక గ్రాము స్ట్రెప్టోమైసిన్ సల్ఫేట్, టెట్రాసైక్లిన్ హైడ్రోక్లోరైడ్ (ప్లాన్టోమైసిన్) మందు కలిపి ఎకరాకు 200 లీటర్ల మందు ద్రావణాన్ని వారం పది రోజుల వ్యవధిలో రెండు మూడుసార్లు పంటంతా తడిసేలా పిచికారీ చేయాలి.

– వి.అశోక్, మండల వ్యవసాయాధికారి, కాజులూరు

ఆందోళనగా ఉంది



పంట దుబ్బు కట్టే దశలో ఎండాకు తెగులు సోకడం ఆందోళనగా ఉంది. పొలమంతా ఎండిపోతున్నట్టు కనిపిస్తోంది. ఇప్పటికే వేలాది రూపాయల పెట్టుబడి పెట్టాం. పురుగు మందుల ధరలు పెరగడంతో తెగుళ్లను అధిగమించటం కష్టంగా మారింది.

– శాఖా జగదీశ్వరరావు, రైతు, మతుకుమిల్లి

ఎదుగుదలపై ప్రభావం



వరి మొక్క వేరు నాటే సమయంలో తెగులు సోకడంతో నష్ట తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఎండాకు తెగులు సోకితే మొక్క క్రమేపీ చనిపోతుంది. మందులు వాడి, తెగులు అరికట్టిన మొక్క ఎదుగుదల తగ్గి, చివరిలో దిగుబడిపై ప్రభావం చూపుతుంది.

– నరాల నాగేశ్వరరావు, రైతు, దుగ్గుదుర్రు

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కాజులూరు: గొల్లపాలెం 33/11 కేవీ స్టేషన్ పరిధిలోని కాజులూరు, కరప మండలాల్లోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. గొల్లపాలెం మెయిన్ సబ్ స్టేషన్ ఏఈఈ ఎం.సూర్యనారాయణ ఆధ్వర్యాన గురువారం జరిగిన సమావేశంలో ఏపీ ఈపీడీసీఎల్ కాకినాడ డీఈఈ జి.ప్రసాద్ ఈ విషయం తెలిపారు. సబ్ స్టేషన్, లైన్ల మరమ్మతు పనుల కోసం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. అంద్రంగి ఫీడర్ పరిధిలోని కరప మండలం పెద్దాపురపాడు, యండమూరు, విజయరాయుడుపాలెం, గొర్రిపూడి, కాజులూరు మండలం గొల్లపాలెం, ఆర్యావటం, బందనపూడి, మతుకుమిల్లి, శలపాక, డేగలపేట, పెనుమళ్ళ, తనుమళ్ళ, అంద్రంగి, పెదపాటిగరువు తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని వివరించారు. ఈ గ్రామాల్లో గృహ వినియోగదారులతో పాటు ఇండస్ట్రియల్ ఫీడర్, ఆక్వా చెరువులకు కూడా సరఫరా ఉండదని తెలిపారు.

ఘనంగా అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం


సామూహిక లక్ష తమలపాకుల పూజలో మహిళా భక్తులు

రామచంద్రపురం రూరల్: వెంకటాయపాలెంలో వేంచేసియున్న శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ పదో వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దంపతుల చేతుల మీదుగా పంచామృతాభిషేకాలు నిర్వహించారు. పెద్దింటి రామకృష్ణమాచార్యులు బ్రహ్మత్వంలో సామూహిక లక్ష తమలపాకుల పూజ, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్న ప్రసాదం వితరణ చేశారు. కార్యక్రమంలో యువ నాయకులు తోట పృథ్వీరాజ్, ఉప సర్పంచ్ గంధం బుజ్జి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం


పీఠంలో నిర్వహిస్తున్న కపిలేశ్వర స్వామి కల్యాణం

రాయవరం: వెదురుపాక విజయదుర్గా పీఠంలో కపిలేశ్వరస్వామి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. పీఠం 51వ వార్షికోత్సవాల్లో భాగంగా గురువారం తిరుపతి పట్టణంలోని కపిలేశ్వరస్వామి ఆలయం నుంచి తీసుకువచ్చిన కపిలేశ్వరస్వామి, కామాక్షి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా కల్యాణ క్రతువును చేపట్టారు. వేద పండితులు చంద్రశేఖరశర్మ, అర్చకులు వివేక్ గురుకుల్, కార్తీక్ గురుకుల్ ఆధ్వర్యంలో కపిలేశ్వరస్వామికి, అమ్మవారికి అభిషేకాల అనంతరం దివ్య కళ్యాణం నిర్వహించారు. సాయంత్రం తమిళనాడు రాష్ట్రం తిరుత్తణి దేవస్థానం అర్చకులు గోపి గురుకుల్ ఆధ్వర్యంలో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి కల్యాణం నిర్వహించారు. పీఠంలో విజయదుర్గా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం(గాడ్) మాట్లాడుతూ కపిలేశ్వరస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణాలు తిలకించడం వలన సకల శుభాలు కలుగుతాయన్నారు. లోక కల్యాణార్థం ఈ పీఠంలో కల్యాణాలు నిర్వహిస్తున్నామన్నారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పీఠం పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్(బాబి) ఆధ్వర్యంలో అన్న సమారాధన చేపట్టారు. ఉత్సవాల్లో ప్రముఖులు కోట సునీల్‌కుమార్, కందర్ప హనుమాన్, పీఠం ప్రతినిధులు గాదె భాస్కర నారాయణ, సత్యవెంకటకామేశ్వరి, పి.సత్యకనకదుర్గ, బి.రమ తదితరులు పాల్గొన్నారు.

'సాయితేజ' సూర్యనారాయణరెడ్డి మృతి

పార్థివ దేహాన్ని సందర్శించిన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి


సూర్యనారాయణరెడ్డి(ఫైల్)


సూర్యనారాయణరెడ్డి పార్థివదేహానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: రాయవరంలోని సాయితేజ విద్యానికేతన్ కరస్పాండెంట్ కర్రి సూర్యనారాయణరెడ్డి(67) అనపర్తి మండలం రామవరంలోని ఆయన స్వగృహంలో గురువారం ఉదయం ఆకస్మికంగా గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి రామవరం చేరుకుని సూర్యనారాయణరెడ్డి పార్థివ దేహాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సూర్యనారాయణరెడ్డి రామచంద్రపురం డిగ్రీ కళాశాలలో తనకు సీనియర్ అన్నారు. రాయవరంలో సాయితేజ విద్యానికేతన్‌ను ప్రారంభించి రాయవరం, పరిసర గ్రామాల విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియం విద్యాబోధన అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. సూర్యనారాయణరెడ్డి పార్థివ దేహాన్ని సందర్శించిన వారిలో మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, అనపర్తి ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, సర్పంచ్ గిరడా గంగాభవాని, ఎంపీటీసీ సభ్యులు నల్లమిల్లి భాగ్యలక్ష్మి, గొలుగూరి గౌతమి లున్నారు.

సూర్యనారాయణరెడ్డి ఆకస్మిక మృతిపై ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ప్రముఖ వైద్యులు జీఎస్ఎన్‌రెడ్డి, తేతల నవీన్‌రెడ్డి, ఎంపీపీ నౌడు వెంకటరమణ, రాయవరం గ్రామాభివృద్ధి కమిటీ ఛైర్మన్ తేతల సుబ్బరామారెడ్డి తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

ఆకస్మికంగా మృతి చెందిన సూర్యనారాయణరెడ్డి నేత్రాలను దానం చేయాలని ఆయన కుటుంబసభ్యులు నిశ్చయించుకుని అనపర్తి శ్రీరాధాకృష్ణ ఐ–బ్యాంక్‌కు తెలియజేశారు. ఐ–బ్యాంక్ సిబ్బంది కార్నియాలను సేకరించారు.

విద్యార్థులకు బస్సు పాసుల పంపిణీ


విద్యార్థులకు బస్సు పాసులు అందజేస్తున్న హెచ్ఎం రాజేశ్వరి

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు దాతలు సమకూర్చిన బస్సు పాసులను ప్రధానోపాధ్యాయిని గుణ్ణం రాజేశ్వరి చేతుల మీదుగా గురువారం అందజేశారు. 250 మంది విద్యార్థులకు బస్సు పాసులు అందజేసిన ప్రసన్న విఘ్నేశ్వర సంస్థల అధినేత సత్తి వెంకట రెడ్డి, లావణ్య హోమ్ నీడ్స్ అధినేత కాకిలేటి సూరిబాబు, దత్తసాయి రెడీమేడ్స్ అధినేత దత్తులకు హెచ్ఎం రాజేశ్వరి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి గిరజాల వెంకట సత్య సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు అరవ విస్సు, అద్దంకి గోవిందరాజు, మెహర్ సుజాత, శ్రీమన్నారాయణ, ఆర్టీసీ సిబ్బంది కుమార్, శ్రీనుబాబు పాల్గొన్నారు.

ఉప ఎన్నిక విజయవంతానికి కృషి చేయాలి


ఎన్నికల సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ రాజు

మండపేట: తాపేశ్వరం 14వ వార్డు ఉప ఎన్నిక విజయవంతానికి పోలింగ్ సిబ్బంది కృషి చేయాలని ఎన్నికల అధికారి, ఎంపీడీఓ ఐ.రాజు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎన్నికల నిర్వహణపై పీఓ, ఏపీఓ, ఇతర పోలింగ్ సిబ్బందికి ఎంపీడీఓ రాజు అవగాహన కల్పించారు. బ్యాలెట్ బాక్సు, ఓటింగ్ నిర్వహణ, కౌంటింగ్ తదితర ప్రక్రియ గురించి వివరించారు. కాగా ఉప ఎన్నికకు ఇరువురు అభ్యర్థులు పోటీలో ఉన్నారు. శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పోలింగ్ అనంతరం కౌంటింగ్ నిర్వహించి విజేతలను ప్రకటిస్తారు. వార్డులో మొత్తం 504 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అధికారులు, రూరల్ పోలీసులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

బీసీల అభ్యున్నతికి అధిక ప్రాధాన్యం


గంగాధర్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బిక్కిన తదితరులు

- బీసీల అభ్యున్నతికి అధిక ప్రాధాన్యం
- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: బీసీ సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యమిస్తూ వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మాజీ సీఎం చంద్రబాబు బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే చూశారని ఆయన విమర్శించారు. మండపేట పీఏసీఎస్ చైర్మన్‌గా నియమితులైన పెంకే గంగాధర్‌కు గురువారం స్థానిక శెట్టిబలిజ కల్యాణ మండపంలో అభినందన సభ ఘనంగా జరిగింది. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బిక్కిన కృష్ణార్జున చౌదరి, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, వైఎస్సార్‌సీపీ జగ్గంపేట నియోజకవర్గ అబ్జర్వర్ వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, పార్టీ రాష్ట్రనేతలు కర్రి పాపారాయుడు, రెడ్డి రాజుబాబు, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ మండపేట మున్సిపల్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వైస్ చైర్మన్ పదవిని శెట్టిబలిజ సామాజికవర్గానికి ఇచ్చామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును సద్వినియోగం చేసుకుని సొసైటీ అభివృద్ధికి నూతన కమిటీ పాటుపడాలని ఎమ్మెల్సీ తోట సూచించారు. అనంతరం సొసైటీ చైర్మన్ గంగాధర్, రామలక్ష్మి దంపతులను ఎమ్మెల్సీ తోట తదితరులు ఘనంగా సత్కరించారు. ఏఎంసీ వైస్ చైర్మన్ చిక్కాల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, యువజన విభాగంనేత చోడే శ్రీకృష్ణ, శెట్టిబలిజ సంఘం పట్టణ అధ్యక్షుడు పంపన శ్రీనివాస్, దేవస్థానం చైర్మన్ సూరంపూడి సత్యప్రసాద్, కల్యాణ మండపం అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కొప్పిశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పిల్లా వీరబాబు, జిన్నూరి సాయిబాబా, దుగ్గిరాల రాంబాబు, లేగా వెంకన్న, తాడి రామారావు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ట్యాంక్ మోటారుకు మరమ్మతులు

కపిలేశ్వరపురం: అంగరలోని ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్ సబ్‌మెర్సిబుల్ మోటారుకు మరమ్మతు చేయించారు. కార్యదర్శి మహమ్మద్ ఆలీ పనులను పర్యవేక్షించారు. మోటారు మరమ్మతుకు గురికావడంతో నీటి సరఫరా సమస్య తలెత్తింది. దీంతో ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు స్పందించి మోటారుకు మరమ్మతు చేయించారు.

శాస్త్రీయ పద్ధతిలో పశుపోషణ

స్టేట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ జేడీ చంద్రశేఖర్ గౌడ్


కేదారిలంకలో పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్, ఏడీఏ

కపిలేశ్వరపురం: పశుపోషణ కార్యక్రమాలను శాస్త్రీయ పద్ధతిలో చేపట్టడం ద్వారా పాడి పరిశ్రమ అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని మండపేటలోని స్టేట్ యానిమల్ హజ్బెండరీ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ జేడీ డాక్టర్ చంద్రశేఖర్ గౌడ్ అన్నారు. తమ ఇనిస్టిట్యూట్‌కు తెలంగాణ నుంచి వచ్చిన ట్రైనీ డాక్టర్లు కేదారిలంకలో క్షేత్ర స్థాయి ప్రయోగాత్మక పరిశీలన కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత పశువైద్య శిబిరాన్ని సర్పంచ్ వీధి వెంకటరెడ్డి, ఎంపీటీసీ యర్రంశెట్టి నాగేశ్వరరావు, ఆలమూరు ఏడీఏ ఎల్.అనిత ప్రారంభించారు. లంక గ్రామాల్లోని పశువుల పెంపకం తీరు, వాటి ఆరోగ్యం, దాణా తదితర అంశాలను ట్రైనీ డాక్టర్లకు మండపేట, కపిలేశ్వరపురం మండలాలకు చెందిన పశువైద్యాధికారులు డాక్టర్ బీవీవీ సత్యనారాయణ, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ ఇందుప్రియ వివరించారు. 20 పశువులకు చూడు తదితర పరీక్షలు ఉచితంగా చేశారు. మినరల్ మిక్చర్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. సచివాలయ ఉద్యోగులు, పాడి రైతులు పాల్గొన్నారు.

మండపేటలో భారీ వర్షం


మండపేటలో కురుస్తున్న వర్షం

విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం

మండపేట: బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో గురువారం మధ్యాహ్నం మండపేట, పరిసర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. దాదాపు గంట పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో పల్లపు ప్రాంతాలు, రోడ్లు జలమయమయ్యాయి. అప్పటి వరకు ఉక్కపోతతో అల్లాడిపోయిన జనానికి వర్షం ఉపశమనం కలిగించింది. ఈదురుగాలులతో రాజీవ్‌గృహకల్ప వద్ద చెట్టు నేలకొరిగి విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సిబ్బంది చెట్లను తొలగించి సాయంత్రం ఆరు గంటల సమయానికి సరఫరాను పునరుద్ధరించారు. కాగా ఈ వర్షం వరి పంటకు మేలు చేస్తోందని రైతులు అంటున్నారు. కాగా గత కొద్దిరోజులుగా ఎండలు వేసవిని తలపిస్తుండగా వాతావరణం చల్లబడటంతో పైరు ఎదుగుదలకు దోహదం చేస్తుందంటున్నారు.

సీఎం జగన్‌ను కలిసిన ఎమ్మెల్యే


సీఎం జగన్‌ను కలిసిన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, డాక్టర్ తేతలి దశరథరామారెడ్డిలు

అనపర్తి: ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, హైదరాబాద్ యశోదా ఆసుపత్రికి చెందిన ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ తేతలి దశరథ రామారెడ్డిలు తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. డాక్టర్ దశరథ రామారెడ్డి కుమార్తె డాక్టర్ శ్రావ్య వివాహ వేడుక ఈ నెల 24న రాజమహేంద్రవరంలో జరగనుంది. ఈ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించాలని కోరుతూ సీఎం జగన్‌కు డాక్టర్ దశరథరామారెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆహ్వాన పత్రిక అందజేశారు. అలాగే, ఎమ్మెల్యే ఆధ్వర్యంలో రంగంపేట మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ మాచిన గోవిందరాజు, కొప్పవరం మాజీ సర్పంచ్ తాడి సూరారెడ్డి, రామేశ్వరం సర్పంచ్ కొటికలపూడి చినబాబులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. రామేశ్వరంలోని జగనన్న కాలనీలో ఏర్పాటు చేయనున్న ఆర్చి డిజైన్‌ను సీఎం జగన్‌కు చూపడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారని ఎమ్మెల్యే తెలిపారు.

శ్రీవారికి నేటి నుంచి నవనీత హారతి

రాయవరం: స్థానిక భూదేవి శ్రీదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి నవనీత హారతులు ప్రారంభించనున్నారు. ప్రతి నెల శ్రవణ నక్షత్రంలో నవనీత హారతి, శ్రీవారికి సేవా కార్యక్రమాన్ని నూతనంగా ప్రారంభిస్తారు. తిరుమలలో మాదిరిగా నవనీత హారతిని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు వేంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్ పులగం శ్రీనివాసరెడ్డి గురువారం విలేకర్లకు తెలిపారు. శ్రీనివాస మంగాపురం ఆలయ అర్చకులు బాలాజీరంగాచార్యులు నవనీత హారతి కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. నవనీత హారతి, సేవా కార్యక్రమానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

అనంతలక్ష్మికి ఘన నివాళి


అనంతలక్ష్మి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

రామచంద్రపురం రూరల్: ప్రగతిశీల మహిళా సంఘం నేత, వెల్ల ఇళ్ల స్థలాల పోరాట నాయకురాలు వీరబోయిన అనంతలక్ష్మికి ప్రజాసంఘాల నాయకులు గురువారం ఘనంగా నివాళి అర్పించారు. వెల్ల బీసీ పేటలో అనంతలక్ష్మి సంతాప సభ నిర్వహించారు.

ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు వెంటపల్లి భీమశంకరం, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు బి.సిద్ధూ, పీవైఎల్ జిల్లా నాయకుడు అంబటి కృష్ణ మాట్లాడుతూ, ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలిగా, వెల్ల గ్రామ రైతుకూలీ సంఘం కమిటీ సభ్యురాలిగా అనంతలక్ష్మి ఎనలేని సేవలందించారన్నారు. గతంలో వెల్ల లాకుల వద్ద పేదల ఇళ్లను టీడీపీ ప్రభుత్వం తొలగించినప్పుడు బడుగు, బలహీన వర్గాల తరఫున ఒంటిపై కిరోసిన్ పోసుకుని పోరాటానికి ముందు వరుసలో నిలిచారని అన్నారు. కాకినాడ, రాజమహేంద్రవరం, మండపేట, కె.గంగవరం, రామచంద్రపురం తదితర ప్రాంతాల్లో మహిళలపై అత్యాచారాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాల్లో పాల్గొన్నారని చెప్పారు. చిన్న వయస్సులోనే అనారోగ్యంతో మృతి చెందిన ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.